క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడ పట్టణంలోని 33కేవీ ఫీడర్ లైన్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 7గంటల నుంచి 10గంటల వరకు మిర్యాలగూడ సబ్‌స్టేషన్ నుంచి వచ్చే 11కేవీ అశోక్ నగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ట్రాన్స్‌కో అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గృహ విద్యుత్ వినియోగదారులు సిబ్బంది సహకరించాలని కోరారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

పెద్దవూర : విద్యుదాఘాతానికి గురై ఆవు మృతి చెందిన సంఘటన శుక్రవారం మండలంలోని సంగారం గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కంచర్ల వెంకట్‌రెడ్డి తనకున్న ఆవులను మేపటానికి వ్యవసాయ పొలాలకు తోలుకుని వెళ్లాడు. ఆవులు మేసుకుంటూ ఈదురు గాలులకు తెగిపడిన విద్యుత్ తీగను తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన ఆవు రూ.75 వేలు ఉంటుందని బాధిత రైతు పేర్కొన్నాడు.

వేలం వాయిదా

మిర్యాలగూడ : మండలంలోని కల్లెపల్లి గ్రామంలో బంగారు మైసమ్మతల్లి దేవస్థానంలో ఏడాది కాలపరిమితికి దున్నపోతులు, కొబ్బరిచిప్పలు, తలనీలాలు సేకరించుకునే హక్కుల కోసం శుక్రవారం గోపాలపురం దేవస్థానం ఈఓ టీవీ.చలపతి సమక్షంలో నిర్వహించిన బహిరంగ వేలం నిర్వహించారు. గత సంవత్సరం కంటే తక్కువ పాట వచ్చినందున ఆ వేలంను ఈనెల 21కు వాయిదా వేస్తున్నట్లు ఆలయ కార్య నిర్వాహణాధికారి గుజ్జుల కొండారెడ్డి తెలిపారు. కాగా వేలం సందర్భంగా ఆలయం వద్ద ఎస్ఐ రవి బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ భాషానాయక్, మాజీ సర్పంచ్ జనార్దన్ నాయక్, నెహ్రూనాయక్, దస్రునాయక్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

భాస్కర్‌రావు చెరువును సర్వే చేసిన అధికారులు

అడవిదేవులపల్లి : మండల కేంద్రంలోని భాస్కర్‌రావు చెరువును శుక్రవారం నీటిపారుదల, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా సర్వే చేశారు. సర్వే నంబరు 59లో ఉన్న భాస్కర్‌రావు చెరువు 130 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. గతంలో ఈ చెరువు కబ్జాకు గురి కావడంతో మత్స్యశాఖ అనుబంధ సంఘం అధ్యక్షుడు చెన్నబోయిన సైదయ్య , సంఘం సభ్యులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయంపై స్పందించిన నీటిపారుదల శాఖ అధికారులు రెవెన్యూ సహకారంతో చెరువు విస్తీర్ణంలో గల సుమారు 95.28 ఎకరాల చెరువు భూమిని గుర్తించి చెరువు హద్దులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నీటిపారుదల శాఖ డీఈ కేశవులు, ఆర్ఐ శ్యాంసుందర్‌లు మాట్లాడుతూ ఈ సర్వేను పూర్తి స్థాయిలో నిర్వహించి నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. వారి వెంట నీటిపారుల శాఖ జేఈ మహేష్, సర్వేయర్ లక్ష్మణ్, మత్స్యశాఖ సంఘం సొసైటీ సభ్యులు తదితరులున్నారు.

హక్కుల సాధనకు నిరంతర పోరాటం

దేవరకొండ : ఆర్టీసీ కార్మికుల హక్కుల సాధనకు ఎంప్లాయిస్ యూనియన్ నిరంతరం పోరాడుతుందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎంప్లాయిస్ యూనియన్ దేవరకొండ గౌరవ అధ్యక్షుడు పల్లా నర్సింహ్మారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద ఎంప్లాయిస్ యూనియన్ 11వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ జెండాను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ నియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రామస్వామి, మెనొద్దీన్, నారాయణ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన కాంగ్రెస్ నాయకులు

డిండి : నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డిని ఆయన నివాసంలో శుక్రవారం మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు మార్యదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలో చేపట్టే పలు అభివృద్ధి కార్యక్రమాలపై ఎంపీ హామీ ఇచ్చినట్లు నాయకులు పేర్కొన్నారు. ఎంపీని కలిసిన వారిలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొంతినేని వెంకటేశ్వరరావు, రాష్ట్ర జిన్నింగ్ మిల్ ఉపాధ్యక్షుడు చింతలపూడి భాస్కర్ రెడ్డి, గౌరిశంకర్ తదితరులున్నారు.

లారీల నుంచి డీజిల్ చోరీ

కొండమల్లేపల్లి : ఆగి ఉన్న రెండు లారీల్లో డీజిల్ దొంగతనం చేసిన ఘటన శుక్రవారం మండల కేంద్రంలో దేవరకొండ రోడ్డులో గల చర్చి ఎదుట చోరీ చేశారు. వివారల్లోకి.. కలవ్వకుర్తి నుండి గుంటూరుకు రెండు లారీల్లో పత్తి గింజల లోడుతో వెళ్తున్న క్రమంలో కొండమల్లేపల్లి పట్టణంలోని దేవరకొండ రోడ్డులో ఉన్న చర్చి ముందుకు రాగానే నిద్ర బాగా వస్తుందని రెండు లారీల డ్రైవర్లు ఆపుకొని నిద్రించగా శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు 650 లీటర్ల డీజిల్‌ను దొంగలించారని లారీ డ్రైవర్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దొంగతనానికి సంబంధించిన వివరాలను సేకరిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిలిచిన భూ రిజిస్ట్రేషన్లు

- తహసీల్దార్ కార్యాలయంలో 15రోజుల క్రితం షార్ట్‌సర్క్యూట్
- కాలిపోయిన కంప్యూటర్లు, సర్వర్లు, స్కానర్లు
- ఇబ్బందులు పడుతున్న భూ క్రయ, విక్రయదారులు



డిండి తహసీల్దార్ కార్యాలయం



షార్ట్‌సర్క్యూట్‌తో కాలిపోయిన కంప్యూటర్, ఇతర సామగ్రి

డిండి : మండలంలోని వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లకు విద్యుత్ షాక్ తగిలింది. గత నెల 25న మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో షార్ట్‌సర్క్యూట్ జరిగింది. అదే సమయంలో రిజిస్ట్రేషన్లు కొనసాగుతుండటంతో ఆన్‌లైన్‌లో పనిచేస్తున్న కంటప్యూటర్లు, సర్వర్లు, స్కానర్‌తో పాటు ఇతర ఇతర సామగ్రి కాలిపోయింది. అప్పటి నుంచి తహసీల్దార్ కార్యాలయంలో భూముల క్రయ, విక్రయాలు జరగడం లేదు. దీంతో పెద్ద మొత్తంలో ప్రభుత్వ ఖాజానాకు గండి పడటంతో పాటు అటు అమ్మకం , కొనుగోలుదారులు ఇబ్బందులు పడుతున్నారు.

ఉన్నతాధికారులు నివేదించినా..

తహసీల్దార్ కార్యాలయంలో 15రోజుల క్రితం షార్ట్‌సర్క్యూట్ జరిగి కంప్యూటర్లు, ఇతర విలువైన పరికరాలు కాలిపోయాయని తహసీల్దార్ జిల్లా ఉన్నతాధికారులకు నివేదించినా ప్రస్తుతం వరకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆ కార్యాలయ అధికారులు భూ క్రయ,విక్రయదారులకు చెప్పుతున్నట్లు తెలిసింది. దీంతో రిజిస్ట్రేషన్ల కోసం స్లాట్ బుక్ చేసుకున్న వారు ప్రతిరోజు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రభుత్వ ఖాజానాకు గండి..

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో 15రోజులకు గాను దాదాపు 100 రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. దీంతో ప్రభుత్వానికి దాదాపు రూ.20 నుంచి రూ.30లక్షలు వరకు వచ్చే ఆదాయం నిలిచిపోవడంతో ప్రభుత్వానికి భారీగా గండి పడినట్లైంది. గత నెల 25నుంచి దాదాపు 50మంది ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకొని రిజిస్ట్రేషన్ల కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి తహసీల్దార్ కార్యాలయానికి నూతన కంప్యూటర్లు, సర్వర్లు ఇతర సామగ్రిని అందజేసి రిజిస్ట్రేషన్లను యథావిధిగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం



డిండి గ్రామపంచాయతీ పరిధిలోని ఇతరుల నుంచి కొనుగోలు చేసిన భూమిని తన పేరు మీదకు రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి పదిరోజుల క్రితమే ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకున్నాను. కానీ రిజిస్ట్రేషన్ కాకపోవడంతో నాతో పాటు మిగతా క్రయ, విక్రయ దారులందరూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

– కుందేళ్ల కొండలు, డిండి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన షార్ట్‌సర్క్యూట్ కారణంగా కంప్యూటర్లు, సర్వర్లు కాలిపోవడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయనే విషయాన్ని 15రోజుల క్రితమే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే నూతన కంప్యూటర్లతో సర్వర్లు ఇతర సామగ్రిని అందిస్తామని తెలిపారు. అవి రాగానే రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ప్రారంభిస్తాం.

– ఎస్.తిర్పతయ్య, తహసీల్దార్, డిండి

నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ధ్యేయం

- సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి



పెద్దవూర : గేమ్యానాయక్‌తండాలో జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

పెద్దవూర : కుల, మత రాజకీయాలకు అతీతంగా సాగర్ నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ధ్యేయంగా పనిచేసి రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. గిరిజన చైతన్య పాదయాత్ర చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా మండలంలోని గేమ్యానాయక్‌తండాలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. తన రాజకీయ ప్రస్థానం ప్రారంభమైంది ఈ తండా నుంచే అని పేర్కొన్నారు. 17 రోజుల పాటు 90 గిరిజన తండాల మీదుగా గిరిజన చైతన్య పాదయాత్ర సాగినట్లు తెలిపారు. మీరు కట్టిన పార్టీ దిమ్మెలు, నేను ఎగిరేసిన జెండాల సాక్షిగా చెబుతున్నా ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తానన్నారు. పంద్రాగష్టు నాటికి అర్హులైన ప్రతి రైతుకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని అన్నారు. తనను ఎమ్మెల్యేగా, తన అన్న రఘువీర్‌రెడ్డిని ఎంపీగా గెలిపించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కోమటికుంటతండాలో సైతం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, మాజీ ఎంపీపీ రమావత్ శంకర్‌నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పబ్బు యాదగిరిగౌడ్, యూత్ అధ్యక్షుడు కిలారి మురళీయాదవ్, మాజీ సర్పంచ్ రమావత్ అశోక్, రమావత్ మునిలాల్, ఐ.సతీష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు అండగా కాంగ్రెస్

త్రిపురారం : గిరిజనులకు అండగా నిలిచిన పార్టీ కాంగ్రెస్ అని త్రిపురారం మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధనావత్ భాస్కర్ నాయక్ అన్నారు. సాగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి గిరిజన చైతన్య యాత్ర చేసి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం మండలంలోని గిరిజన తండాల్లో త్రిపురారం గిరిజన సంఘం ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేసి సంబరాలు జరుపుకున్నారు. గిరిజన తండాల అభివృద్ధి జానా రెడ్డి, ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి, ఎంపీ రఘువీర్ రెడ్డిలకే సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధనావత్ వెంకట్రాం నాయక్, ధనావత్ హుస్సేన్ నాయక్, ధనావత్ విజయ, కలకొండ శివ శంకర, మల్లయ్య, పాండు, ధనావత్ హరిలాల్ నాయక్, పత్తి నాయక్, చందు, ధనావత్ శ్రీ రాం నాయక్, బాల్ సింగ్ నాయక్, తులసీ రాం , ధనావత్ సేవ, నేనావత్ శంకర్ పాల్గొన్నారు.

ఎంఈఓ కార్యాలయం ఎదుట బీసీ సంఘాల ధర్నా



ధర్నా చేస్తున్న బీసీ సంఘాల నాయకులు

మిర్యాలగూడ టౌన్ : స్థానిక మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట శుక్రవారం బీసీ విద్యార్థి, బీసీ యువజన, మాలమహానాడు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఎంఈఓ ప్రైవేట్ విద్యా సంస్థలకు కొమ్ముకాస్తున్నాడని ఆరోపిస్తూ కార్యాలయానికి తాళం వేశారు. అనంతరం బీసీ విద్యార్థి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ జీడయ్య యాదవ్, యువజన సంఘం రాష్ట్రవర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ మాట్లాడుతూ ప్రైవేట్ విద్యా సంస్థలు విచ్చలవిడిగా అధిక ఫీజులు, అధిక ధరలకు పాఠ్యపుస్తకాలు,టై, బెల్ట్, షూల పేరుతో పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నా ఎంఈఓ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వెంటనే ఎంఈఓను సస్పెండ్ చేయాలని డిమాండ్‌చేశారు. అలాగే ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పట్టణంలోని నారాయణ స్కూల్‌లో పెద్దమొత్తంలో పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, బెల్ట్‌లు, టైలు, షూ డంప్ చేసి బహిరంగంగా నారాయణ స్కూల్ బ్యాగులతో విక్రయిస్తున్న అధికారులు పట్టించుకోకపోవడంతో స్కూల్ ఎదుట ఆ సంఘాల నాయకులు ధర్నా చేపట్టారు. అనంతరం పుస్తకాలు డంప్ చేసిన గదికి తాళాలు వేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాలు, మాల మహానాడు నాయకులు పొలగాని వెంకటేష్ గౌడ్, తాళ్లపల్లి సురేష్, అర్లపూడి శ్రీనివాస్, చిలకల మురళి యాదవ్, సిద్దంరాజు, గంగాధర్, ఉపేందర్, నరేష్ తదితరులున్నారు.

ఎరువుల డీలర్లు నిబంధనలు పాటించాలి



మాడుగులపల్లి : ఫర్టిలైజర్ దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ నాగమణి

మాడుగులపల్లి : ఎరువులు, విత్తనాల డీలర్లు ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఏడీఏ నాగమణి సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఎరువులు, విత్తనాల దుకాణాలను శుక్రవారం ఏఓ సైదానాయక్‌తో కలిసి ఆమె పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్, యూరియా, కాంప్లెక్స్ ఎరువుల విక్రయ రిజిస్టర్లను పక్కాగా నిర్వహించాలన్నారు. విత్తనాలు, ఎరువులు కొన్న రైతుల వివరాలు రోజువారీగా ఈ–పాస్‌లో నమోదు చేయాలని చెప్పారు. నకిలీ విత్తనాలు, నాణ్యత లేని క్రిమిసంహారక మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. నిబంధనలు పాటించని డీలర్ల లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

హాలియా : నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయాధికారి సరిత తెలిపారు. శుక్రవారం హాలియా పట్టణంలోని ఫర్టిలైజర్స్, ఫెస్టిసైడ్స్ సీడ్స్ షాపులను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా షాపుల్లో స్టాక్ వివరాలు, రిజిష్టర్లు, బిల్లులను తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విత్తనాల కొనుగోలు సమయంలో రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు రశీదు తీసుకొని, పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపర్చుకోవాలని తెలిపారు. అలాగే లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దే కొనుగోలు చేయాలి తప్ప గ్రామాలకు వచ్చే వారి విడి విత్తనాలు తీసుకోవద్దని సూచించారు. నకిలీ విత్తనాలు విక్రయించినా, రైతులకు బిల్లులు ఇవ్వకుండా విక్రయాలు జరిపినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట ఏఈఓలు ఉన్నారు.

వినతిపత్రం అందజేత

డిండి : డిండి గ్రామ రెవెన్యూ పరిధిలో రైతులు కోల్పోయిన దాదాపు 450 ఎకరాల వ్యవసాయ భూమిని తిరిగి రైతులకు పట్టాలివ్వాలని కోరుతూ శుక్రవారం హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో పలువురు రైతులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వారసత్వంగా వస్తూ పట్టా కలిగిన తమ వ్యవసాయ భూములను డిండి ప్రాజెక్టు నిర్మాణ సమయంలో దాదాపు 450 ఎకరాలను అవసరాల నిమిత్తం అప్పటి ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి సేకరించిందని ఎలాంటి ఆధారాలు లేకుండానే 2009 సంవత్సరంలో కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు కార్యనిర్వాహక ఇంజనీరు నల్లగొండ పేరు మీదకు మార్చేశారన్నారు. తమ భూములు తమకు ఇప్పించాలని ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని వారు పేర్కొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ధరణి దరఖాస్తులు ఆన్‌లైన్



ఆర్డీఓ కార్యాలయంలో ధరణి దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్న అధికారులు

మిర్యాలగూడ: డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల రైతుల నుంచి వచ్చిన ధరణి దరఖాస్తులను పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ జి. శ్రీనివాస్‌రావు సమక్షంలో ఆన్‌లైన్ చైస్తున్నారు. మిర్యాలగూడ రెవెన్యూ డివిజన్ పరిదిలోనిసుమారు 8,752 మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో ధరణి అంతా తప్పుల తడకగా ఉందని ఆరోపణలుండడంతో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే రైతులు దరకాస్తులు చేసుకున్నారు. రైతుకు సంబంధించిన భూమి పట్టాదారు పాస్‌పుస్తకాల్లో లేకపోవడం, ఎక్కువ, తక్కువ చూపడం, పేర్లు తప్పు ఉండడం, భూమి మాయమవడం, సర్వే నంబర్లు ఉన్నా భూమి లేకపోవడం, నిషేదిత భూములుగా చూపడం తదితర సమస్యలపై ఎన్నికలకు ముందు దరఖాస్తు చేసుకున్న సుమారు 2వేల మంది రైతుల దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేసి కలెక్టరేట్‌కు పంపించారు. ఎంపీ, ఎమ్మెల్సీ ఎన్నికల కారణంగా కలెక్టరేట్‌లో ఆన్‌లైన్ చేయలేదు. తిరిగి వాటిని ఆర్డీఓ కార్యాలయానికి పంపారు. ఆర్డీఓ కార్యాలయంలో రెండు కంప్యూటర్లలో దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్నారు. వారం రోజుల్లో దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తామని ఆర్డీఓ శ్రీనివాస్‌రావు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సునీత

వేములపల్లి : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంతో పాటు మండల అభివృద్ధికి కృషిచేయాలని ఎంపీపీ పుట్టల సునీత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఇరుగు మంగమ్మ, వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని, పీఏసీఎస్ చైర్మన్ జడ రాములు యాదవ్, ఎంపీడీఓ శారదాదేవి, వైద్యాధికారి సుచరిత, ఏఓ రుషేంద్రమణి, డీటీ కోటేశ్వరి, ఏఈలు ఆదినారాయణ, నాగరాజు, చిన్నినాయక్, పశువైద్యాధికారి సందీప్, సీహెచ్‌వో స్వామి, ఎంపీవో లలిత, ఏపీఎం నజీరొద్దిన్, ఏపీఓ మిరాజొద్దిన్, ఎంపీటీసీలు పల్లా వీరయ్య, చైతన్య, శ్రీరాంరెడ్డి, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల పక్కనే రసాయన వ్యర్థాలు



జాతీయ రహదారి పక్కనే పారబోసిన రసాయన వ్యర్థాలు



గేట్‌వాల్వ్ పక్కగా వెళ్లిన ప్రమాదకర వ్యర్థాలు

పెద్దవూర: గుర్తు తెలియని ట్యాంకర్లలో ప్రమాదకరమైన రసాయన వ్యర్థాలను తీసుకువచ్చి గుట్టు చప్పుడు కాకుండా అర్ధరాత్రి సమయాల్లో రోడ్ల వెంట పోసి వెళ్లిపోతున్నారు. మండలంలోని జడ్చర్ల –కోదాడ జాతీయ రహదారిపై సంగారం స్టేజీ సమీపంలో గురువారం రాత్రి రోడ్డు పక్కన లారీ ట్యాంకర్‌ను ఉంచి రసాయన వ్యర్థాలను పోసి వెళ్లారు. దీంతో రోడ్డు పక్కన పెద్ద గొయ్యి ఏర్పడింది. పక్కనే ఉన్న మండల ప్రజలకు తాగునీటి జలాలు అందించే పైపులైన్‌కు ఏర్పాటు చేసిన గేట్ వాల్వ్ చుట్టూ వ్యర్థాలు చేరి భూమిలోకి ఇంకిపోయాయి. చెట్లు, మొక్కలు మాడిపోయాయి. రహదారిపై వెళ్లే పాదచారులు, వాహనదారులు రసాయన వ్యర్థాల నుంచి వచ్చే ఘాటైన వాసనను భరించలేక పోతున్నారు. అధికారులు స్పందించి రసాయన వ్యర్థాలను రోడ్ల వెంట పారబోసే వాహనాలను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం



మిర్యాలగూడ : ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ శేషగిరి శర్మ



అడవిదేవులపల్లి : సూచనలు చేస్తున్న ఎంపీడీఓ కరుణాకర్‌రావు

మిర్యాలగూడ : ప్రజలు తమ ఇంటితోపాటు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నట్లయితే వ్యాధులు దరిచేరవని ఎంపీడీఓ శేషగిరిశర్మ అన్నారు. శుక్రవారం మిర్యాలగూడ మండలంలోని యాద్గార్‌పల్లి, అవంతీపురం, బాదలాపురం, సుబ్బారెడ్డిగూడెం, జాలుబాయితండాలో పర్యటించి మిషన్ భగీరథ నీటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికి తాగునీరు అందించే విషయమై ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ నీరు ఇంటింటికి వస్తుందా, పరిశుభ్రంగా నీరు వస్తుందా అనే విషయాలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైనందున గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ వీరారారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

అడవిదేవులపల్లి : వర్షాకాలం ప్రారంభమైనందున సీజినల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ కరుణాకర్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి ప్రజలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు సోకకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, ఉరుములు, పిడుగులు పడే సమయంలో ప్రజలు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. అదే విధంగా పలు విషయాలపై గ్రామాల్లో ర్యాలీల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రధానంగా గ్రామాల్లో పారిశుద్ధ్యంపై గ్రామాల్లో టంకా వేయించాలన్నారు. అదే విధంగా మైకల ద్వారా కూడా అవగాహన కల్పించాలని సూచించారు. మిషన్ భగీరథ నీటిపై పూర్తి స్థాయిలో సర్వే జరుగుతుందని, మండలంలోని ఉల్సాయిపాలెం, తాటిచెట్టుతండ అవసాల్లో ఈ సర్వే ముమ్మరంగా సాగుతుందని, ప్రజలు ఈ సర్వేకు అన్నీ విధాలుగా సహకరించాలని కోరారు. పాఠశాలలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అక్షారాశభ్యాసం కార్యక్రమంలో కూడా ఆయన పాల్గొని మాట్లాడారు. ఆయన వెంట ఎంపీఓ మెహసిన్ బిన్ అహ్మద్ ఉన్నారు.

మాడుగులపల్లి : పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే సీజనల్ వ్యాధులు దరి చేరవని మండల పంచాయతీ అధికారి సంగీత అన్నారు. మండలంలోని ఇసుకబావిగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం పారిశుద్ధ్యంపై జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముందని, ఇళ్ల పరిసరాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. రోడ్ల వెంట నివాస సముదాయాల మధ్య చెత్త వేయొద్దని, పారిశుద్ధ్య చర్యల్లో పంచాయతీ కార్మికులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అంతకుముందు గ్రామంలో మిషన్ భగీరథ నీటి సరఫరా తీరును ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సయ్యద్ ఇస్రత్, పంచాయతీ కార్మికులు పోతురాజు శ్రీనివాస్, మేడి ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఉపకార వేతనాలకు విద్యార్థుల ఎంపిక

పెద్దఅడిశర్లపల్లి : కేంద్రం ప్రభుత్వం నిర్వహించిన జాతీయ ఉపకార వేతనాల (ఎన్ఎంఎంఎస్)పరీక్షలో మండలంలోని దుగ్యాల మోడల్ స్కూల్ చెందిన ఓర్సు సుప్రియ, రమావత్ హన్మంతు, రమావత్ హాతీరాంలు ఎంపికై నట్లు మోడల్ స్కూల్ ప్రిన్స్‌పాల్ మల్లేష్ తెలిపారు. దీంతో విద్యార్థులకు 9వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు సంవత్సరానికి రూ.12 వేలు ఉపకారవేతనం రానన్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించినట్లు తెలిపారు.

నిడమనూరు : నిడమనూరు మోడల్ స్కూల్ విద్యార్థులు కోడి వెంకట్, కొంగరి చిన్మయి ఇద్దరు ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్)కు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ రంజిత శుక్రవారం తెలిపారు. ఎంపికైన వారికి 9వ తరగతి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు ప్రతి ఏటా రూ.12వేలను అందజేస్తుందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ రంజిత, అధ్యాపక బృందం అభినందించింది.

రైతులకు కొత్త రుణాలు ఇవ్వాలని ధర్నా



కెనరా బ్యాంక్ ఎదుట ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

మిర్యాలగూడ : స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ రుణపరిమితిని పెంచి రైతులకు కొత్త రుణాలు ఇవ్వాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మిర్యాలగూడ మండలంలోని అవంతీపురం కెనరా బ్యాంక్ ఎదుట ధర్నా చేపట్టి అనంతరం బ్యాంక్ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానాకాలం సీజన్ ప్రారంభమైనందున ప్రభుత్వం రైతులకు కొత్త రుణాలను అందించడంతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం వెంటనే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు కొత్త రుణాలు అందించకపోవడంతో ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు రుణమాఫీ చేయడంతోపాటు కొత్త రుణాలు అందించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రవినాయక్, రాగిరెడ్డి మంగారెడ్డి, గోవిందరెడ్డి, కోట్ల శ్రీనివాస్‌రెడ్డి, చౌగాని వెంకన్న, వీరారెడ్డి, నాగేశ్వర్‌రావు, లింగయ్య, ఆశీర్వాదం, రవి, సైదులు పాల్గొన్నారు.

డీఎస్పీ సూచనలు పాటించాలని వినతి

హాలియా : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నూతన చిహ్నం విషయంలో ధర్మసమాజ్ పార్టీ (డీఎస్పీ) సూచనలు పాటించాలని కోరుతూ ఆ పార్టీ అనుముల మండల అధ్యక్షుడు మామిడి రవి శుక్రవారం అనుముల మండల తహసీల్దార్ జయశ్రీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మామిడి రవి మాట్లాడుతూ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చిహ్నాన్ని మారుస్తూ ఆ స్థానంలో కొత్త చిహ్నం తీసుకురావాలని వివిధ పార్టీల నుంచి, సంస్థల నుంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు స్వీకరిస్తుందని తెలిపారు. అందులో భాగంగానే డీఎస్పీ కూడా ప్రభుత్వానికి ఒక చిహ్నాన్ని ప్రతిపాదించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు లింగాల గోవర్ధన్, నాగయ్య, లక్ష్మణ్, వంశీ, శేఖర్, అంజి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



కార్మికులకు కరపత్రాన్ని అందజేస్తున్న ఉపాధ్యాయులు

మిర్యాలగూడ : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు కొర్ర కృష్ణకాంత్‌నాయక్, తావూరియా నాయక్, జనార్దన్‌రెడ్డిలు అన్నారు. శుక్రవారం మిర్యాలగూడ మండలంలోని గూడూరు, కృష్ణాపురం గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పాఠశాలల ఆవశ్యకతను వివరించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.